క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ని కలసిన చింతలపాటి



జగన్‌మోహన్‌రెడ్డితో చింతలపాటి శ్రీనురాజు

తాళ్లరేవు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం పార్టీ రాష్ట్ర నాయకుడు, రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనురాజు కలిశారు. అధినేతను కలసి పలు అంశాలపై చర్చించినట్లు శ్రీనురాజు విలేకర్లకు తెలిపారు.

రోగులకు కంటి పరీక్షలు

తాళ్లరేవు: ఉప్పంగల పంచాయతీలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర వైద్య నిపుణుడు శీరం సత్తిబాబు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తామని తెలిపారు. సత్తిబాబు మాట్లాడుతూ మూడు రోజులుగా సుంకరపాలెం, ఇంజరం, ఉప్పంగల గ్రామాల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. ఆయా గ్రామాల నుంచి సుమారు 30 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం కిరణ్‌ కంటి ఆసుపత్రికి పంపినట్లు వివరించారు. సర్పంచ్‌ శాఖా శంకరుడు, సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్‌ సామగ్రి అందజేత



ఈదరపల్లిలో శానిటేషన్‌ సామగ్రి అందిస్తున్న గెయిల్‌ ఇన్‌చార్జి రాంబాబు తదితరులు

అమలాపురం రూరల్‌: తాటిపాక గెయిల్‌ ఇండియా లిమిటెడ్‌ వారు గురువారం ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రాన్ని సందర్శించి శానిటేషన్‌ సామగ్రిని అందించారు. జూలై 1 నుంచి 15వ తేదీ వరకూ స్వచ్ఛతా పక్షోత్సవాల సందర్భంగా ఈ సేవ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. తాటిపాక గెయిల్‌ ఇన్‌చార్జి కె.రాంబాబు, సీనియర్‌ మేనేజర్లు సుధీర్‌ కుమార్‌, ఎస్‌.రామకృష్ణ, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన పశుగ్రాసం అందించాలి



చిన గాడవిల్లిలో రైతులకు పశుగ్రాస విత్తనాలు అందిస్తున్న వైద్యాధికారి నిరోషా

ఉప్పలగుప్తం: పాడి పశువులకు పోషకాలతో కూడిన పశుగ్రాసాన్ని అందిస్తే పాల దిగుబడి పెరుగుతుందని మండల పశు వైద్యాధికారి ఎన్‌.నిరోషా అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా గొల్లవిల్లి, చిన గాడవిల్లి, పెద గాడవిల్లి గ్రామాల్లో పాడి రైతులకు పశువులకు అందించాల్సిన మేతపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందించారు. పశు వైద్య సహాయ సంచాలకులు గుద్దటి వెంకటేష్‌, ఆకాష్‌, రైతులు దామిశెట్టి సత్యనారాయణ మూర్తి, నూకల రాజా, మంచెం బాలకృష్ణ, అడబాల సత్యనారాయణ, పినిశెట్టి ఏసుబాబు, పోలిశెట్టి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం: చల్లపల్లి, ఉప్పలగుప్తం సబ్‌ స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత, మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు అమలాపురం ఈఈ ఎం.రవికుమార్‌ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గొల్లవిల్లి, భట్నుపాలెం, సుధాపాలెం, మంచెంవారిపాలెం, గంధంవారి పాలెం, నగవరం, భీమనపల్లి, విలసవిల్లి, సింగరాయపాలెం, ఉప్పలగుప్తం, మునిపల్లి, పెద్దగాడవిల్లి, చిన్నగాడవిల్లి, సన్నవిల్లి, వానపల్లిపాలెం, ఎన్‌ కొత్తపల్లి, రాఘవులపేట గ్రామాలకు, గోపవరం, ఎస్‌.యానం, చల్లపల్లి, వాసాలతిప్ప, నక్కారామేశ్వరం, సిరిపల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు.

ఐ.పోలవరం: స్థానిక విద్యుత్తు సబ్‌ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం టి.కొత్తపల్లి, ఐ.పోలవరం ,జి.మూలపాలెం, కేశనకుర్రు, తిల్లకుప్ప గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్‌ ఉండదు.

స్పందించిన అధికారులు

కాట్రేనికోన: స్థానిక పంచాయతీ గొల్లవీధిలో కలుషిత నీటి సరఫరాపై ‘సాక్షి’ దినపత్రికలో వచ్చిన కథనానికి సర్పంచ్‌ గంటి వెంకట సుధాకర్‌ ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు స్పందించారు. గొల్లలవీధిలో వారం రోజుల నుంచి కలుషిత మంచి నీరు సరఫరా కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు, పంచాయతీ సిబ్బంది శ్రమించి పైప్‌లైన్‌లోకి కలుషిత నీరు రాకుండా లీకులను అరికట్టారు.

మభ్యపెట్టి.. మెలిక చుట్టి..

- పిల్లలందరికీ ‘తల్లికి వందనం’ హామీకి గ్రహణం
- కూటమి నేతల మాటలు వెనక్కి
- ఇప్పుడు ఒక్కరికే అంటూ ప్రచారం
- గత ప్రభుత్వంలో ఠంచనుగా ‘అమ్మ ఒడి’



అమలాపురం కలెక్టరేట్‌లో అమ్మ ఒడి నమూనా చెక్కును అందజేస్తున్న గత కలెక్టర్‌ హిమాన్షు శుక్లా (ఫైల్‌)

అమలాపురం టౌన్‌/ ముమ్మిడివరం: ఎన్నికల ముందు హామీలు ఇవ్వడమే కాదు.. వాటిని సమర్థంగా అమలు చేస్తేనే ఆ ప్రభుత్వాలకు, పాలకులకు మనుగడ ఉంటోంది. అప్పుడే ప్రజల అభిమానాన్ని చూరగొంటుంది.. ఇచ్చిన మాటను దాటవేసే ధోరణి అవలంబిస్తే ఛీదరింపులు, వ్యతిరేకత తప్పదు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వానికి అదే ఎదురవుతోంది. ‘ఎంతమంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తాం.. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇస్తాం..’ ఇది ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలు. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలోని అమ్మ ఒడి పథకం పేరు మార్చి నేడు తల్లికి వందనం పేరిట అమలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు చెప్పారు. ప్రస్తుతం ఇంకా పథకం అమలు కాకపోవడం, ఒక్కరికే అమలు చేస్తామనడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో తమ పిల్లలను చదివించే తల్లుల బ్యాంక్‌ ఖాతాల్లో స్కూళ్లు తెరిచిన కొద్ది రోజులకే అమ్మ ఒడి సొమ్ము జమయ్యేది. ఆ డబ్బులతో పిల్లల చదువుకు అవసరమైన అదనపు ఖర్చులు అంటే, స్కూల్‌ లేదా కాలేజీ బస్సులు, ఆటోలకు రవాణా చార్జీలు తదితర వాటికి సద్వినియోగం చేసుకునేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చింది. స్కూళ్లు తెరిచి నెల రోజులు దాటింది. తల్లికి వందనం సొమ్ము ఊసేలేకపోవడంతో రెండు నియోజకవర్గాల్లోని తల్లులు నిట్టూర్పు వదులుతున్నారు. అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం పట్టణం, రూరల్‌, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్‌ విద్యా సంస్థల్లో చదువుతున్న తమ బిడ్డకు అమ్మ ఒడి డబ్బులు గత ఐదేళ్లూ ఠంఛన్‌గా పడ్డాయని తల్లులు అంటున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించిన కూటమి ముఖ్య నేతలు ఆ హామీ అమలు గురించి మాట్లాడకపోవడంపై విద్యార్థుల తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 236 ప్రాథమిక, 35 ఉన్నత, 3 గురుకుల పాఠశాలలు, ఒక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, సుమారు 45 ప్రైవేట్‌ స్కూళ్లు, 14 ప్రైవేట్‌ జూనియర్‌ కాలేజీలు ఉన్నాయి. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గంలో 257 ప్రాథమిక, 24 ప్రాథమికోన్నత, 53 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఒక గురుకుల బాలికల పాఠశాల, ఒక ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, సుమారు 24 ప్రైవేట్‌ పాఠశాలలు, 7 జూనియర్‌ కళాశాలలు ఉన్నాయి. ఇందులో చదువుతున్న విద్యార్థులకు ఇంటికి ఒకరు చొప్పున గత ఐదేళ్లూ వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పథకం వర్తింపజేసి, తల్లుల బ్యాంక్‌ అకౌంట్లలో సొమ్ము జమ చేసింది.

గత ఐదేళ్ల వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం లబ్ధిదారులు, ఇచ్చిన నిధులు

మండలం	విద్యార్థులు	నిధులు (రూ.కోట్లు)
అమలాపురం పట్టణం, రూరల్‌	10,148	15.22
అల్లవరం	21,620	27.98
ఉప్పలగుప్తం	5,337	8.55
ముమ్మిడివరం	5,760	8.64
కాట్రేనికోన	5,341	8.01
తాళ్లరేవు	8,200	12.30
ఐ.పోలవరం	4,470	6.70

హామీ అమలు చేయాలి



గత ప్రభుత్వంలో అమ్మ ఒడి సొమ్ము అనుకున్న సమయానికి జమ అయ్యేది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చాక ఆ డబ్బు కోసం ఎదురు చూస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. ఒకరు అమలాపురంలోని ఓ ప్రైవేట్‌ స్కూలులో ఆరో తరగతి, మరొకరు బండారులంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మా ఇద్దరి పిల్లలకు రూ.30 వేలు వస్తుందని ఎదురు చూస్తున్నాం. ఆ హామీ అమలులో సాధ్యమా...? అనే అనుమానం వ్యక్తం అవుతోంది. అమ్మ ఒడి డబ్బులతో పిల్లలకు నెలనెలా ఆటో చార్జీలు చెల్లించేదాన్ని.

–పలివెల కనకదుర్గ నాగలక్ష్మి, నడిపూడి, అమలాపురం రూరల్‌

ఇస్తారో లేదో తెలియక..



తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో పిల్లలందరికీ ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు కావొస్తున్నా పథకంపై స్పష్టత ఇవ్వలేదు. అసలు ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ప్రైవేట్‌ పాఠశాలల్లో ఫీజుల భారం భరించలేకపోతున్నాం. మా అమ్మాయి ఇంటర్‌ మొదటి సంవత్సరం, అబ్బాయి ఏడో తరగతి చదువుతున్నారు. వీరికి ఏడాదికి రూ.90 ఫీజులు చెల్లిస్తున్నాం. ఇవి కాక బుక్స్‌, ట్రావెలింగ్‌, ఎగ్జామ్‌ ఫీజులు అదనం. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం ద్వారా స్కూల్‌ ఆరంభంలోనే సొమ్ము అందించారు.

–పలివెల నరసవేణి, బోడసకుర్రు, అల్లవరం మండలం

ఇప్పుడు ఒక్కరే అనడం సరికాదు



నాకు ఇద్దరు పిల్లలు. బాబు 4వ తరగతి, పాప 2 తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు తెరిచి పిల్లలు బడికి వెళ్లేసరికి మాకు అమ్మ ఒడి అందింది. దానిని తల్లికి వందనం పేరుతో ఈ ప్రభుత్వం పాఠశాలలకు వెళ్లే ప్రతి ఒక్కరికి సొమ్ము వేస్తారని నమ్మి ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నాం. నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి చలనం లేదు. పైగా ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని ఇప్పుడు ఒకరికి మాత్రమే ఇస్తారనడం సరికాదు.

–గుంట్రు దుర్గ, సన్నవిల్లి, ఉప్పలగుప్తం మండలం

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా సొమ్ము ఇస్తామని కూటమి నేతలు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరినీ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. గతంలో ఒక్క పిల్లకే అమ్మ ఒడి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇద్దరికీ ఇవ్వాలి. అప్పుడే కొత్త ప్రభుత్వంపై అందరికీ నమ్మకం వస్తుంది

–విత్తనాల పార్వతి, తాళ్లరేవు

ట్రిపుల్‌ ఐటీకి విద్యార్థుల ఎంపిక



స్వప్నప్రియ



గాలిదేవర హాసిని



కుదుపూడి కీర్తన



పసుపులేటి అనూష



మనోజ్ఞ

కాట్రేనికోన: కాట్రేనికోన జెడ్పీహెచ్‌ స్కూల్‌ విద్యార్థి మాదేటి స్వప్నప్రియ, పి.లక్ష్మివాడ జెడ్పీహెచ్‌ స్కూల్‌ విద్యార్థి గాలిదేవర హాసినిలు ఒంగోలు ట్రిబుల్‌ ఐటీ క్యాంపస్‌కు ఎంపికయ్యారు. కాట్రేనికోన పంచాయతీ వెంకమ్మ చెరువుకు చెందిన మాదేటి ఏడుకొండలు, కుమారి దంపతుల కుమార్తె స్వప్నప్రియ. తల్లి దండ్రులు వ్యవసాయ కూలీలు అయినప్పటికీ ఇష్టంతో చదువుకుంది. కాట్రేనికోన జెడ్పీహెచ్‌ స్కూల్‌లో పదో తరగతిలో 569 మార్కులు సాధించింది. స్వప్నప్రియను ప్రోత్సహించేందుకు పాఠశాల గణిత ఉపాధ్యాయుని ఎం.సీతామహలక్ష్మి రూ.10 వేలు అందజేశారు. ఆమెను సర్పంచ్‌ గంటి వెంకట సుధాకర్‌, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌వీఎస్‌ రమాదేవి తదితరులు అభినందించారు.

ఉప్పలగుప్తం: ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించిన 19 మంది విద్యార్థులు ట్రిపుల్‌ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈఓ కె.కుమార్‌ బాబు తెలిపారు. భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది, ఎన్‌.కొత్తపల్లి పాఠశాలలో ఆరుగురు, గొల్లవిల్లి పాఠశాలలో నలుగురు, మునిపల్లి పాఠశాలలో ఒకరు ట్రిపుల్‌ ఐటీ ఎంపికయ్యారని ఆయన వివరించారు.

ఐ.పోలవరం: కొమరగిరి జిల్లా ప్రజా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు ట్రిపుల్‌ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం కొల్లాటి శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో కుదుపూడి కీర్తన, పసుపులేటి అనూష, యాళ్ల మనోజ్ఞ ఉన్నారన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న రైతు సంఘ సభ్యులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో రైతు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ అన్నారు. గురువారం ఇటీవల ఎన్నికైన దరియాలతిప్ప రైతు సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే అశోక్‌ను కలసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ శాఖ పరంగా రావాల్సిన రాయితీలు తదితర వాటి గుర్చి చర్చించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు తిరుకోటి భైరవమూర్తి, ఉపాధ్యక్షుడు వాకపల్లి సుబ్బారావు, కోశాధికారి సబ్బతి లోకేశ్వర రావు, కార్యదర్శి మట్టా రాంబాబు, సబ్బతి రాంబాబు, సభ్యులు కోరుకొండ అప్పన్న, లోవరాజు, రైతులు మోకాబుజ్జి, మెల్లం చిన్న తదితరులు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలతో అనర్థాలు



వైద్య సిబ్బందికి జ్ఞాపిక అందిస్తున్న జాయింట్‌ కలెక్టర్‌ నూపుర్‌ అజయ్‌

అమలాపురం రూరల్‌: జనాభా పెరుగుదలతో అనేక అనర్థాలు తలెత్తుతాయని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ ఎస్‌.నూపుర్‌ అజయ్‌ అన్నారు. అమలాపురం కలెక్టరేట్‌లో వైద్య ఉద్యోగుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న జనాభాతో తలెత్తే దుష్పరిణామాలను ప్రజలు గుర్తించాలన్నారు. దీనిపై వివరించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. జనాభా నియంత్రణకు వైద్య సిబ్బంది చేపట్టిన సేవలను ప్రశంసిస్తూ మెమెంటోలతో ఆమె సత్కరించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీహెచ్‌వీ భరత్‌లక్ష్మి, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్‌ జాన్‌ లెవీ, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిస కావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వీరబాబు

అల్లవరం: యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందని, వారు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సీఐ వీరబాబు సూచించారు. ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్‌ కళాశాలలో డ్రగ్స్‌ రహిత ఆంధ్రప్రదేశ్‌ అనే అంశంపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్‌ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాదకద్రవ్యాలు, గంజాయి వాడకం వల్ల అనర్థాలు, దుష్ఫలితాలపై వివరించారు. డ్రగ్స్‌ తీసుకున్న వ్యక్తి ఈ సమాజానికి ఎంతో ప్రమాదమని, వారి పట్ల జాగ్రత్త అవసరమని తెలిపారు. ఎస్సై హరీష్‌కుమార్‌ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తులు శారీరక, మానసిక రుగ్మతలకు గురై బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

దాడుల నియంత్రణకు సాగర్‌ కవచ్‌

యానాం: సముద్ర మార్గాన ఉగ్రవాదులు వస్తే ప్రత్యేక నిఘా ఉంచి వారిని గుర్తించి ఎదుర్కొనే విధంగా, ముంబయి తరహా దాడులు జరగకుండా కేంద్ర ప్రభుత్వం సాగర్‌ కవచ్‌ కార్యక్రమాన్ని చేపట్టింది. సముద్రం, జాతీయ రహదారులకు వచ్చే మార్గాలపై నిఘా ఉంచేందుకు రెండు రోజుల పాటు కాకినాడలో సాగర్‌ కవచ్‌ పేరిట నిర్వహిస్తున్నారు. మాక్‌డ్రిల్‌లో భాగంగా కోస్టల్‌ మెరైన్‌ ఎక్స్‌ర్‌సైజ్‌లో గురువారం యానాం వచ్చిన రెడ్‌ఫోర్స్‌ సభ్యులను యానాం ఎస్పీ రాజశేఖరన్‌ ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక ఫ్లాగ్‌పోస్టు వద్ద పట్టుకుని వారి వివరాలను నమోదు చేశారు. సముద్ర సంబంధిత భద్రతా వ్యవస్థలతో సంయుక్తంగా ఇండియన్‌ కోస్టుగార్డు, ఇండియన్‌ నేవీ, కోస్టల్‌ సెక్యూరిటీ నిర్వహిస్తోందని ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్‌ ఎస్సై శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఇంపాక్ట్‌ — వలకట్ల తొలగింపు



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న తహసీల్దార్‌ సునీల్‌కుమార్‌, ఇతర అధికారులు

అల్లవరం: వలకట్లే ముంచేస్తున్నాయ్‌ అంటూ ‘సాక్షి’ దినపత్రికలో బుధవారం వచ్చిన కథనానికి మండల స్థాయి స్పందించారు. మండలంలోని ప్రధాన డ్రైన్లో చేపల కోసం ఏర్పాటు చేస్తున్న వలకట్లను డ్రైన్స్‌ ఏఈ సునీత ఆధ్వర్యంలో తొలగించారు. అలాగే తహసీల్దార్‌ సునీల్‌కుమార్‌ ఆధ్వర్యంలో రెవెన్యూ, డ్రైన్స్‌, వ్యవసాయ, మత్స్యశాఖ అధికారులు సమీక్షించారు. ఆక్వా చెరువుల వ్యర్థాలను మురుగు బోదెల్లోకి వదిలేయకుండా రైతులకు నోటీసులు ఇవ్వాలని ఎఫ్‌డీఓ అశ్వినికి సూచించారు. మండలంలోని ప్రధాన డ్రైన్లు లోయర్‌కౌశిక, పంచనీటి కాలువ, వాసాలతిప్ప డ్రైన్లో వలకట్లు ఏర్పాటు చేయకుండా నిర్వాహకులకు నోటీసులు ఇవ్వాలని డ్రైన్స్‌ ఏఈ సునీతకు తహసీల్దార్‌ తెలిపారు. అనంతరం అల్లవరం, రెల్లుగడ్డ గ్రామాల్లో ముంపు తీవ్రతకు మునిగిన నారుమడులను అధికారులు పరిశీలించారు. అల్లవరంలో పదెకరాలు, రెల్లుగడ్డలో 30 ఎకరాల్లో ముంపు సమస్య ఉందని ఏఓ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. వలకట్లు తొలగించిన తర్వాత డ్రైన్లో మురుగు నీరు దిగువకు వెళ్తుందని, ముంపు తీరే అవకాశం ఉందని ఏఓ తెలిపారు.

కలెక్టర్‌ను కలసిన వైద్యులు



కలెక్టర్‌ మహేష్‌కుమార్‌ను కలసిన ఐఎంఏ కోనసీమ శాఖ వైద్య బృందం

అమలాపురం టౌన్‌: జిల్లా కలెక్టర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రావిలాల మహేష్‌కుమార్‌ను ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ (ఐఎంఏ) కోనసీమ శాఖ వైద్యుల బృందం గురువారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఐఎంఏ కోనసీమ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్‌ఎస్‌ఎన్‌ మూర్తి, డాక్టర్‌ కదలి ప్రసాద్‌ ఆధ్వర్యంలో వైద్యులు కలసి కొద్దిసేపు మాట్లాడారు. సీజనల్‌ వ్యాధుల పట్ల వైద్యులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ మహేష్‌కుమార్‌ తనను కలసిన వైద్యులకు సూచించారు. ఐఎంఏ ప్రతినిధులైన వైద్యులు గొలకోటి రంగారావు, పీఎస్‌ శర్మ, కె.రమణ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్‌: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రావిలాల మహేష్‌ కుమార్‌ను మాతా రమాబాయి అంబేడ్కర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ పుణ్యమంతుల రజని, సభ్యులు కలుసుకున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆయన్ని రజిని, సభ్యులు బీర ప్రమీళ, తాళ్ల లలిత, విప్పర్తి లక్ష్మీ సరస్వతి, కందికట్ల సుభాషిణి, గుర్రాల సుజాత, దేవరపల్లి సత్యవతి తదితరులు కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

అఖండ హోమాలతో విశ్వ శాంతి



అఖండ హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పీఠాధిపతి పరిపూర్ణానందగిరి

అమలాపురం టౌన్‌: ధార్మిక సంస్థలు నిర్వహించే అఖండ హోమాలతో విశ్వ శాంతి సిద్ధిస్తుందని చిత్తూరు జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతి శ్రీపరిపూర్ణానందగిరి అన్నారు. స్థానిక విద్యుత్‌ నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో వారాహి షోడస రాత్ర మహోత్సవాల్లో భాగంగా 72 గంటలుగా జరుగుతున్న 3890వ దివ్య జ్ఞాన మోక్ష అఖండ హోమంలో పీఠాధిపతి పాల్గొని అభిభాషన చేశారు. హోమం గురువారం తెల్లవారు జాము 3 గంటలకు పూర్ణాహుతితో ముగిసింది. పరిపూర్ణానందగిరి మాట్లాడుతూ ఇలాంటి హోమాలను చేసినా, చూసినా భక్తుల జన్మ ధన్యమవుతుందన్నారు. బ్రహ్మశ్రీ వేమ వెంకట శివకుమార్‌, శ్రీగౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ప్రతినిధులు, సేవకులు నాగ కనకదుర్గ, నూకల కుమారి, లింగోలు శిరీష, తూము దొరబాబు, అరిగెల బుజ్జి తదితరులు భక్తులకు సేవలు అందించారు.

అతిసారం నియంత్రణకు కంట్రోల్‌ రూమ్‌



శానిటేషన్‌ సిబ్బందికి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ మనోహర్‌

అమలాపురం టౌన్‌: పట్టణంలో అతిసార, సీజనల్‌ జ్వరాల నియంత్రణకు కంట్రోల్‌ రూమ్‌తోపాటు ప్రత్యక్ష టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నట్లు అమలాపురం మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌.మనోహర్‌ వెల్లడించారు. మున్సిపల్‌ కార్యాలయంలో ఓ కంట్రోల్‌ రూమ్‌, పర్యవేక్షణకు 91212 33006 ఫోన్‌ నంబరును అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పట్టణంలోని పారిశుధ్య సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బందితో స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ మనోహర్‌ గురువారం నిర్వహించిన అత్యవసర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ప్రజల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచాలని సూచించారు. దోమలు, పందుల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పట్టణాన్ని 274 క్లస్టర్లుగా విభజించి రోజు వారీ ప్రణాళిక అమలుపై చర్చించారు. ముఖ్యంగా తాగునీటి పైపులైన్ల లీకేజీలను గుర్తించి నీరు కలుషితం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా కూడా కమిషనర్‌ సిబ్బందికి జాగ్రత్తలను వివరించారు.

యూడీసీలకు బదిలీలు

యానాం: పుదుచ్చేరిలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న యానాంకు చెందిన యూడీసీలను బదిలీలు చేస్తూ గురువారం డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ పర్సనల్‌ అండ్‌ అడ్మినిస్ట్రేటివ్‌ రిఫామ్స్‌ శాఖ కార్యదర్శి వి.జయశంకర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. సీహెచ్‌ కాళీకృష్ణను యానాం కోఆపరేటివ్‌ శాఖకు, కరెడ్ల అరుణాదేవిని డిప్యూటీ కలెక్టర్‌ ఆఫీస్‌కు, కడింశెట్టి సుషాంత్‌ రెడ్డిని యానాం పోలీస్‌శాఖకు, ముత్యాల శ్రీరమ్యని ప్రభుత్వ ఆసుపత్రికి, వి.వసంతకుమార్‌ని ఎంజీజీ ఆర్ట్స్‌ కాలేజీ మాహేకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని సంబంధిత అధికారులు 15 రోజుల్లో రిలీవ్‌ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

19న ఇంటర్వ్యూలు

అమలాపురం రూరల్‌: జిల్లా బాలల సంరక్షణ కేంద్రం శిశు గృహలో మేనేజర్‌, సోషల్‌ వర్కర్‌, నర్సు, పార్ట్‌టైమ్‌ డాక్టర్‌, ఆయా, తదితర పోస్టుల్లో కాంట్రాక్ట్‌ పద్ధతిపై ఒక ఏడాది కాలానికి పనిచేసేందుకు పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి 19న ఉదయం 10 గంటలకు అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి మీటింగ్‌ హాల్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయి. ఈ విషయాన్ని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి ఝాన్సీ తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో రావాలన్నారు.

జనాభా పెరుగుదలతో అభివృద్ధికి ఆటంకం

ముమ్మిడివరం: పర్యావరణ సమతుల్యం, అభివృద్ధి కుంటుపడటానికి జనాభా పెరుగుదలే కారణమని అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి అన్నారు. ముమ్మిడివరంలో పీపుల్స్‌ సర్వీస్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో ఎంజీఆర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జనభా పెరుగుదలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జనాబా పెరిగే కొద్దీ మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రిన్సిపాల్‌ కట్టా శ్రీనివాసరావు, ఆర్గనైజేషన్‌ అధ్యక్షుడు కన్నీడి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు కిరణ్‌, రామరాజు, భానుప్రసాద్‌ పాల్గొన్నారు.

రేపు ఏడు కొత్త కోర్టులు ప్రారంభం

యానాం: పుదుచ్చేరిలో నాలుగు రీజియన్లకు అందుబాటులో ఉండే విధంగా ఈ నెల 13న ఏడు కొత్త కోర్టులను ప్రారంభించనున్నారు. దీనికి చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మహదేవన్‌, ఎల్జీ రాధాకృష్ణన్‌, సీఎం రంగసామి హాజరు కానున్నారు. కడలూరు రోడ్డులోని కోర్టు కాంప్లెక్స్‌లో ఈ కోర్టులను ప్రారంభించనున్నారు.

సీజనల్‌ వ్యాధులపై అవగాహన

అమలాపురం టౌన్‌: సీజనల్‌ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం మున్సిపాలిటీ, 15 వార్డు సచివాలయాల శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్‌, ఎన్విరాల్‌మెంట్‌ సెక్రటరీలు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఆరో వార్డులోని మహాత్మా గాంధీ మున్సిపల్‌ హైస్కూల్‌ విద్యార్థులకు సీజనల్‌ వ్యాధులపై శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ నాగేంద్ర, శానిటేషన్‌, ఎన్విరాల్‌మెంట్‌ సెక్రటరీ బండి వీరన్న గురువారం అవగాహన కల్పించారు. కలుషిత నీరు, ఆహారమే అతిసారం వ్యాధికి ప్రధాన కారణమని వివరించారు. డెంగీ, మలేరియా, చికెన్‌ గున్యా వంటి సీజనల్‌ జ్వరాలు, వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు బీఆర్‌ కామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడికి సంతాపం

తాళ్లరేవు: రేబిస్‌తో మృతి చెందిన వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు మందనక్క తణుకురాజు కుటుంబానికి పలువురు సంతాపం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్‌ సంఘాల్లో తణుకురాజు చేసిన సేవలు ఎనలేనివని వైఎస్సార్‌ సీపీ మండల ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, ప్రజా సంఘాల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు అన్నారు. మృతుని కుటుంబ సభ్యులను వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష పోరాట సమితి నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కూరాకుల సింహాచలం, రుద్రవరపు భూలోకం, విప్పర్తి శ్రీనివాసరావు, పులపకూర గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

దొరబాబుపై కూటమి నేతల విమర్శ

అల్లవరం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఎన్నికల్లో కూటమికి పని చేశాడని చెప్పడం అబద్ధమని కూటమి నేతలు తీవ్ర విమర్శలు చేశారు. బెండమూర్లంకలో టీడీపీ నాయకుడు యాళ్ల కాసుబాబు నివాసంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. బీజేపీ ముసుగులో దొరబాబు వైఎస్సార్‌ సీపీకి కోవర్టుగా పని చేస్తున్నారని కూటమి నేతలు యాళ్ల ఈశ్వరరావు, గుర్రం రాంజీ, ఆదినారాయణ, ముత్యాల రాజు, వల్లూరి వెంకటరావు తదితరులు అన్నారు.